ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 108 | పేజీలు: 4 | వెల: రూ.3/- | ఆదివారం 28 జులై 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్




## వికసిత్ భారత్ @ 2047

### ప్రతి భారతీయుడి ఆశయం: మోదీ

న్యూఢిల్లీ, జులై 27 (ప్రభాత ఉదయం): నీతి ఆయోగ్ తొమ్మిదో పాలకమండలి సమావేశం రాష్ట్రపతి భవన్‌లోని సాంస్కృతిక కళాక్షేత్రంలో ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగింది. 2047నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దటానికి అవసరమైన విజన్ డాక్యుమెంట్‌పై పాలక మండలి సభ్యులు ప్రధానంగా చర్చించారు. ఈ దశాబ్దం మార్పులు, సాంకేతికత, భౌగోళిక రాజకీయాలు సహా అవకాశాలతో కూడుకున్నదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. 2047 నాటికి ..మిగతా 2లో

## 2029 ఎన్నికల నాటికి పాతబస్తీకి

# మెట్రో రైలు

### సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, జులై 27 (ప్రభాత ఉదయం): పాతబస్తీ మెట్రో నిర్మాణానికి తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. అసెంబ్లీ బడ్జెట్ సెషన్‌లో భాగంగా ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ అడిగిన ప్రశ్నకు సీఎం ఈ మేరకు బదులిచ్చారు. కేంద్ర భాగస్వామ్యం ఉన్నా లేకున్నా, నాలుగేళ్లలో ఓల్డ్‌సిటీ మెట్రో పనులు పూర్తి చేసే బాధ్యత తమదని సీఎం హామీ ఇచ్చారు. పాతబస్తీ మెట్రోరైలు ప్రాజెక్టు నాలుగేళ్లలో పూర్తి చేసి తీరుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. కేంద్రం నిధులు ఇచ్చినా, ఇవ్వకపోయినా 2029 ఎన్నికల్లోగా పాతబస్తీ మెట్రో పూర్తి చేస్తామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో చాంద్రాయణగుట్టకు మెట్రో రైలులోనే వచ్చి ఓట్లు అడుగుతామని తెలిపారు. మెట్రో నిర్మాణంపై ఎల్ అండ్ టీతో చర్చలు జరుపుతున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. పాతబస్తీకి మెట్రో రైలు వస్తుందంటూ కొన్నేళ్లుగా ఊరిస్తున్నారు కానీ రావడం లేదంటూ అసెంబ్లీలో ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ చేసిన వ్యాఖ్యలపై సీఎం స్పందించారు. పాతబస్తీ అంటే ఓల్డ్ సిటీ కాదని, ఒరిజినల్ సిటీ అంటూ రేవంత్ రెడ్డి అభివర్ణించారు. జైపాల్ రెడ్డి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్నప్పుడు హైదరాబాద్ మెట్రోరైలు నిర్మాణానికి కృషి చేశారని ఈ సందర్భంగా ప్రస్తావించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పాతబస్తీకి మెట్రోరైలు అందుబాటులోకి రాలేదని, తాము అధికారంలోకి రాగానే ..మిగతా 2లో

## జూరాల వద్ద కృష్ణమ్మ పరవళ్లు.. 44 గేట్లు ఎత్తివేత

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 27(ప్రభాత ఉదయం)కర్ణాటక జలాశయాల నుండి కృష్ణానదీలోకి భారీగా వద్ద ప్రవాహం వస్తుండటంతో జూరాల వద్ద కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. శనివారం సాయంత్రానికి జూరాల జలాశయానికి 3,02,000 క్యూసెక్కులు ఇన్ ఫ్లో నమోదు కాగ అవుట్ ఫ్లో లో 3,16,308 క్యూసెక్కులుగా నమోదయింది. ఎగువ ఉన్న నారాయణపూర్ డ్యాం నుంచి జూరాల ప్రాజెక్టుకు దాదాపు 3 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండడంతో ప్రాజెక్టు 44 గేట్లు ఎత్తివేసి 3,02,000 క్యూసెక్కుల వరద నీటిని దిగువన ఉన్న శ్రీశైలం ..మిగతా 2లో



## మా గ్యారెంటీల సంగతి సరే..

# పదేళ్లలో మీరేం చేశారు

### బీఆర్ఎస్ పై డిప్యూటీ సీఎం భట్టి ఆగ్రహం



హైదరాబాద్, జులై 27 (ప్రభాత ఉదయం): గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మండిపడ్డారు. అసెంబ్లీలో బడ్జెట్ పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయానికి 72 వేల కోట్లు ఇవ్వడం తప్పా?. మహిళలను ఆదుకోవడం తప్పా?. గత ప్రభుత్వ తప్పులను సరిదిద్దడం తప్పా?. మా గ్యారెంటీల సంగతి సరే.. పదేళ్లు బీఆర్ఎస్ ఏం చేసిందని అసెంబ్లీ సాక్షిగా ప్రశ్నించారు. మేము పెట్టిన పీపుల్స్ మార్చ్ బడ్జెట్ పై బీఆర్ఎస్ నేతలు సానుకూలంగా స్పందిస్తారని ఆశించానన్నారు. బడ్జెట్ బాగుంది.. బాగాచేశారు. ప్రజల కోసం మీరు మీ ముఖ్యమంత్రి, మీ పార్టీ బాగా కష్టపడుతోందని అంటారని ఆశించా అని మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. మీరు ఇప్పుడే వచ్చారు.. ఇంకా ఐదు సంవత్సరాల సమయం ఉంది. మీకు సమయం ఇస్తున్నాం అనే ఆలోచన చేస్తారని అనుకున్నా. కానీ కాంగ్రెస్ మీద దాడి చేయడం తప్ప హరీష్ రావు మాట్లాడిందేమీ లేదన్నారు. బీఆర్ఎస్ పదేళ్లు పాలన చేని అంతిమంగా మీరు చెప్పిన ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. మేము తక్కువ కాలంలోనే చాలా పథకాలు అమలు చేశామని గుర్తు చేశారు. తాము రైతన్నల గురించి ఆలోచన చేసి రూ.72,659 కోట్లు బడ్జెట్ లో ప్రతిపాదించాం. హైదరాబాద్ నగరాభివృద్ధి , మున్సిపల్ అండ్ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ కింద రూ.15,594 కోట్లు ఇచ్చాం. ఎస్సీ సబ్ ప్లాన్ గురించి రూ. 33124 కోట్లు, ఎస్టీ సబ్ ప్లాన్ కోసం రూ.1,756 కోట్లు కేటాయించాం. మాది రియలిస్టిక్ బడ్జెట్ అని భట్టి విక్రమార్క అసెంబ్లీలో స్పష్టం చేశారు.

**20 ఏళ్లు మేమే ఉంటాం**

రాబోయే 20 ఏళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందన్నారు. దేశం గర్వించేలా గురుకులాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వం అధికారంలో ఉన్న పదేళ్లు ఎస్సీ, ఎస్టీ నిధులను పక్కదారి పట్టించిందన్నారు. ప్రతి నియోజకవర్గంలో అంబేద్కర్ స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని భట్టి తెలిపారు. తెలంగాణను అప్పుల పాలు చేసిన ఘనత బిఆర్ఎస్‌దేనని మల్లు భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. 2024- 2025 ఆర్థిక సంవత్సరానికి ..మిగతా 2లో



## నీతి ఆయోగ్ సమావేశంలో రభస

### మమతా బెనర్జీ వాకౌట్


### మాట్లాడుతుంటే మైక్ ఆఫ్ చేశారని ఆరోపణలు

న్యూఢిల్లీ, జులై 27 (ప్రభాత ఉదయం): నీతి ఆయోగ్ సమావేశం రాజకీయ ప్రకంపనలు సృష్టించింది. ఇండీ కూటమికి చెందిన నేతలు కొందరు ఈ భేటిని బైకాట్ చేశారు. ఈ సమావేశానికి హాజరైన బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మధ్యలోనే వాకౌట్ చేశారు. ప్రధాని మోదీ నేతృత్వంలో జరుగుతున్న సమావేశంలో మధ్యలోనే బయటకు వచ్చేశారు. బీజేపీయేతర రాష్ట్రాలకు కేంద్రం అన్యాయం చేస్తోందని మండి పడ్డారు. దీనిపై నినదించినందుకే సమావేశంలో తనను మాట్లాడనివ్వలేదని ఆరోపించారు. మైక్ ఆఫ్ చేశారని విమర్శించారు. కనీసం 5 నిముషాలు కూడా మాట్లాడకుండానే అడ్డుకున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఈ తీరు నచ్చకే బయటకు వచ్చేసినట్టు స్పష్టం చేశారు. బడ్జెట్‌లో పశ్చిమ బెంగాల్ ఎలాంటి కేటాయింపులు లేకుండా అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాట్లాడుతుండగానే ఉన్నట్టుండి మైక్ ఆఫ్ చేశారని ..మిగతా 2లో

## ఆగస్టులో ప్రధాని మోదీ

# ఉక్రెయిన్ పర్యటన

న్యూఢిల్లీ, జులై 27 (ప్రభాత ఉదయం): ప్రధాని నరేంద్ర మోదీ త్వరలోనే ఉక్రెయిన్‌లో పర్యటిస్తారని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఆగస్టు 23వ తేదీన ఆయన ఉక్రెయిన్‌లో పర్యటించనున్నట్టు సమాచారం. అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ప్రత్యేకంగా భేటీ అవనున్నారు. రష్యా ఉక్రెయిన్ యుద్ధం మొదలై ఇప్పటికి మూడేళ్లు గడిచాయి. అప్పటి నుంచి యుద్ధం తీవ్రతరమవుతూనే ఉంది. దీనిపై మోదీ ప్రభుత్వం తమ వైఖరి ఏంటో చాలా సందర్భాల్లో తేల్చి చెప్పింది. అయితే...ఈ యుద్ధం మొదలైన తరవాత తొలిసారి ప్రధాని మోదీ ఉక్రెయిన్‌లో పర్యటించనున్నారు. ఇటీవలే మోదీ రష్యా పర్యటనకు వెళ్లారు. పుతిన్‌తో సమావేశమయ్యారు. అంతకు ముందు జీ7 సదస్సులో ఉక్రెయిన్ ..మిగతా 2లో





2

## బీజేపీకి 8 ఎంపీ సీట్లు ఇచ్చినా..

# తెలంగాణపై అదే వివక్షా?: కేటీఆర్

## తెలంగాణలోని 13 మంది

# డీఎస్పీలకు పదోన్నతులు



హైదరాబాద్, జులై 27 (ప్రభాత ఉదయం): రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పనిచేస్తున్న డీఎస్పీలకు అడిషనల్ ఎస్పీలుగా పదోన్నతులు కల్పించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. సీఐడీ విభాగంలో డీఎస్పీలుగా పనిచేస్తున్న కె శంకర్, డి. ఉపేంద్రా రెడ్డి, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో పనిచేస్తున్న బి. ప్రతాప్‌కుమార్, ఎ.విశ్వప్రసాద్, ..మిగతా 2లో

## మా గ్యారెంటీల సంగతి సరే..

# పదేళ్లలో మీరేం చేశారు?

మొదటి పేజీ తరువాయి...

ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ప్రతిపక్షాలు చేస్తున్నది అక్షరాల తప్పుడు ప్రచారమని భట్టి విక్రమార్క మండిపడ్డారు. పదేళ్లు అధికారంలో ఉండి ఏమి చేయకుండా వెళ్లినవారు ఇప్పుడు మాపై మాటల దాడి చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చి కేవలం ఎనిమిది నెలలే అయ్యిందని అందులో మూడు నెలలు ఎన్నికల కోడ్‌లోనే గడిపోయిందన్నారు. ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నట్లుగా బడ్జెట్ ఊహాజనితంగా ఎక్కడుందంటూ ప్రశ్నించారు.

### హైదరాబాద్ కోసమే రూ.10వేల కోట్లు

వ్యవసాయం కోసం రూ.72 వేల కోట్లు కేటాయించడం తప్పా.? రాష్ట్ర రాజధాని హైదరాబాద్ కోసం రూ.10 వేల కోట్లు కేటాయించడం తప్పా అని ప్రతిపక్షాలపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల్ని పక్కదారి పట్టించారని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ కోసం బడ్జెట్‌లో రూ. 17,056 కోట్లు , మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. 30 వేలకు పైగా ఉద్యోగాలిచ్చామంటూ గుర్తు చేశారు. మరో 35 వేల ఉద్యోగాలు సిద్ధంగా ఉన్నాయని, నాలుగు నెలల్లోనే 65 వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చిన ఘనత మా ప్రభుత్వానిదే అన్నారు. రుణమాఫీపై కొందరు ఎగతాళి చేశారని.. ఎంత కష్టమైనా రుణమాఫీపై ముందుకెళ్తుతున్నామని గుర్తు చేశారు.

### రైతు కూలీలకు రూ.12వేలు

ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినట్లుగా రైతు కూలీలకు రూ.12 వేల ఆర్థిక సాయం ఈ ఏడాది నుండే ఇస్తామన్నారు. త్వరలో స్పష్టమైన విద్యుత్ పాలసీని అమలు చేస్తామన్నారు. 2035 వరకు విద్యుత్ పాలసీని సిద్ధం చేశామని ఉపముఖ్యమంత్రి అన్నారు. ఏదో ఐదేళ్లు గడిపేయడానికి మేం అధికారంలోకి రాలేదని, తమ ప్రభుత్వానికి స్పష్టమైన విజన్ ఉందన్నారు. దేశం గర్వించేలా తెలంగాణలో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను తీసుకువస్తామన్నారు. దాదాపు 20 నుండి 25 ఎకరాల సువిశాల ప్రాంగణంలో ఇంటిగ్రేటెడ్ గురుకులాలను నిర్మిస్తామని తెలిపారు. ప్రపంచంతో పోటీ పడేలా తెలంగాణ విద్యార్థుల తయారు కావాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ నూతన విద్యా విధానం దేశానికి ఆదర్శం కాబోతుందన్నారు.

### ప్రతి ఒక్కరికి సొంతిల్లు

ప్రతి పేదవాడికి ఇల్లు నిర్మించి ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం పెట్టుకుందన్నారు. త్వరలోనే 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తామన్నారు. గ్యారంటీలను అమలు చేసేందుకు మంత్రులందరూ కష్టపడి చేస్తున్నారని భట్టి అసెంబ్లీలో తెలిపారు. రాష్ట్రంలో మొదటిసారిగా స్కిల్ డెవలప్ మెంట్ యూనివర్శిటీకి రూపకల్పన చేశామన్నారు. రైతు భరోసా అమలులో ప్రజాధనం వృథా కాకూడదనే.. రైతుల నుంచి సలహాలు తీసుకుంటున్నామన్నారు. పదేళ్లుగా పదోన్నతులు, బదిలీలు లేకపోవడంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. తమ ప్రభుత్వంలో 16వేల మంది టీచర్లకు పదోన్నతులు, బదిలీలు కల్పించినట్లు వివరించారు. అభివృద్ధి చర్యల ఫలాలు ఐదు, పదేళ్ల తర్వాత కనిపిస్తాయని ఉద్ఘాటించారు.

### బీఆర్ఎస్ వి అన్నీ మోసాలే

బీఆర్ఎస్ పార్టీ ఏమి చేప్పింది?? ఏమి చేసిందో అందరికీ తెలుసని భట్టి విక్రమార్క అన్నారు. దళితుడిని ముఖ్యమంత్రి



చేస్తామని చెప్పారు.. చేశారా?.. దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని చెప్పారు.. ఇచ్చారా? ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పారు.. ఇచ్చారా? ప్రతి మండలంలో బాలురుకు, బాలికలకు ప్రత్యేకంగా రెండు నుంచి మూడు రెసిడెన్షియల్ స్కూల్స్ కడతామని చెప్పారు.. కట్టారా?? అని అసెంబ్లీ సాక్షిగా ప్రశ్నించారు. ఆరు గ్యారంటీలకు గురించి చెప్పాల్సిన పనిలేదు. రాజీవ్ ఆరోగ్యశ్రీ మొత్తాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం. ప్రతి గ్యారంటీనీ అమలు చేసేందుకు తపిస్తున్న ప్రభుత్వం మాది. ప్రభుత్వంలోని ప్రతి మంత్రి ఉదయం నుంచి సాయంత్రం వరకూ వారివారి కార్యలయాల్లో సమీక్షలు నిర్వహిస్తూ.. పనిచేస్తున్నారు. గ్యాస్ సిలండర్ ను రూ. 500కే అందిస్తున్నాం. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని భట్టి విక్రమార్క అన్నారు.



## 2029 ఎన్నికల నాటికి పాతబస్తీకి

# మెట్రో రైలు

మొదటి పేజీ తరువాయి...

శంకుస్థాపన చేసినట్లు సీఎం తెలిపారు. రెండో దశ మెట్రో ప్రాజెక్టు కోసం కేంద్రానికి నివేదిక ఇచ్చినట్లు వివరించారు. సమాఖ్య విధానం మేరకు కేంద్రం నుంచి నిధులు రాబట్టుకోవడం ప్రయత్నిస్తామన్నారు. అయితే కేంద్రం ఇవ్వనంత మాత్రాన అభివృద్ధి ఆగదని, రుణాలు ఇవ్వడానికి ఆర్థిక సంస్థలు, పీపీపీ మోడల్‌లో చేసేందుకు ప్రైవేట్ సంస్థలు సిద్ధంగా ఉన్నాయని రేవంత్ రెడ్డి తెలిపారు. హైటెక్ సిటీ నుంచి ఎయిర్‌పోర్టుకు గత ప్రభుత్వం టెండర్లు పిలిచిందన్న ఆయన, స్థిరాస్థి సంస్థల భూముల ధరలు పెంచేందుకే ఆ మార్గంలో మెట్రో ఏర్పాటు చేసినట్లు మండిపడ్డారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ నుంచి ఎయిర్‌పోర్టుకు మంచి రోడ్లు ఉన్నాయని, మెట్రో అవసరం లేని మార్గాల్లో నిర్మాణానికి టెండర్లు పిలిచారని దుయ్యబట్టారు. ఈ క్రమంలోనే తమ ప్రభుత్వం ఎల్బీనగర్ నుంచి ఎయిర్‌పోర్టుకు మెట్రో నిర్మించనుందని వివరించారు. ఇటీవల పార్లమెంటు ఎన్నికల సమయంలో తనపై, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాపై పోలీసులు కేసు పెట్టారన్న అక్బరుద్దీన్, ఆ తర్వాత అమిత్ షాపై కేసును తొలగించి, తప్పు లేకపోయినా తనపై మాత్రం కొనసాగిస్తున్నారన్నారు. సీఎం పెద్దన్న సోదరుడు కాబట్టి అమిత్ షాపై కేసు తొలగించారని, పేద మిత్రుడిని కాబట్టి తనపై కొట్టివేయలేదన్న అక్బర్ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి స్పందించారు. అక్బరుద్దీన్ ఆరోపణల్లో వాస్తవం లేదన్న రేవంత్ రెడ్డి, ఎన్నికల ప్రచారంలో చిన్నపిల్లలను ప్రచారంలో వినియోగించారని కేంద్ర మంత్రులు అమిత్ షా, కిషన్ రెడ్డిపై ఫిర్యాదు చేసేందే కాంగ్రెస్ అని చెప్పారు. ఆ తర్వాత నిర్వాహకులపై ఛార్జిషీట్ వేసిన పోలీసులు, అమిత్ షాను తొలగించారని దానిపై కాంగ్రెస్ పార్టీ కోర్టులో న్యాయ పోరాటం చేస్తోందని చెప్పారు. ఎవరు అవునన్నా, కాదన్నా మోదీ దేశానికి ప్రధాని కాబట్టి రాష్ట్రాలన్నింటికీ పెద్దన్న వంటివారేనని సీఎం అన్నారు. గుజరాత్, బిహార్‌లా తెలంగాణకు కూడా నిధులు ఇవ్వాలని, వివక్ష చూపకుండా పెద్దన్నలా వ్యవహరించి రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని బహిరంగంగా సభలో అడిగినట్లు వివరించారు. మోదీని పెద్దన్న అన్నది రాష్ట్ర ప్రయోజనాల కోసమే తప్ప, రాజకీయ స్వప్రయోజనాల కోసం కాదన్నారు. మోదీని పొడిగితే తనకు వార్డు మెంబరు బీఫాం కూడా రాదని, కాంగ్రెస్ కార్యకర్తలు, ఎమ్మెల్యేల వల్లే తాను సీఎంగా ఉన్నానని సీఎం వ్యాఖ్యానించారు.



వైద్యం కోసం ఎల్ఓసి అందజేస్తున్న చేస్తున్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

## రోగులకు కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసిన

# ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, జూలై 27(ప్రభాత ఉదయం) మల్కాజ్ గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి వైద్య సహాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను వారి కుటుంబాలకు అందజేశారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా లబ్ధిపొందిన వారికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా చెక్కులను అందజేశారు. అల్వాల్ డివిజన్ కు చెందిన జి.ప్రేమ కి 2వేలు, కె.సురేష్ కి 24వేలు, వినాయక్ నగర్ డివిజన్ కు చెందిన బండ శ్రీను కి 54,000 3. నేరెడ్ మెట్ డివిజన్ కు చెందిన డి.శ్రీనివాస్ గారికి 60,000 ఎ.అజయ్ కుమార్ కి18వేలు , మౌలాలి డివిజన్ కు చెందిన కిరణ్ కుమార్ కి18వేలు, ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ కు చెందిన దానమ్మ కు 31వేలు, బాలమణికి 27వేల రూపాయల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్ రెడ్డి, చిన్న యాదవ్, మల్లేష్ గౌడ్, వి.ఎన్.రాజు, శరణ్ గిరి,వసంత కుమార్, దుంబాల సత్తయ్య పాల్గొన్నారు.

# వికసిత్ భారత్ @ 2047

మొదటి పేజీ తరువాయి...

భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడం ప్రతి ఒక్క భారతీయుడి ఆశయమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలను కలిగి ఉండటం వల్ల ఈ ఆశయ సాధనలో రాష్ట్రాలు ముఖ్యమైన పాత్ర పోషించేందుకు అవకాశం ఉందని తెలిపారు. పాలకమండలి సమావేశంలో ప్రధాని మోదీ ఈ వ్యాఖ్యలు చేసినట్లు నీతి ఆయోగ్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేసింది. నీతి ఆయోగ్ సమావేశంలో ఈ దశాబ్దం మార్పులు, సాంకేతికత, భౌగోళిక రాజకీయాలు సహా అవకాశాలతో కూడుకున్నదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ అవకాశాలను భారత్ అందిపుచ్చుకుని అంతర్జాతీయ పెట్టుబడులకు అనుగుణంగా విధానాలను రూపకల్పన చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భారత్‌ను అభివృద్ ధిచెందిన దేశంగా తీర్చిదిద్దడానికి ఇది ఒక అడుగు అని పేర్కొన్నారు. మనం సరైన దిశలోనే పయణిస్తున్నామని వందల ఏళ్లకు ఒకసారి వచ్చే మహమ్మారిని జయించామని వెల్లడించారు. ప్రజలు ఉత్సాహం, విశ్వాసంతో ఉన్నారన్న ఆయన, రాష్ట్రాల సంయుక్త కృషితో వికసిత్ భారత్-2047ను సాకారం చేసుకోవచ్చని అభిప్రాయపడ్డారు. వికసిత్ రాష్ట్రాలు, వికసిత్ భారత్‌ను తీర్చిదిద్దుతాయని పేర్కొన్నారు. అయితే సమావేశం అనంతరం వివరాలను నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం మీడియాకు వెల్లడించారు. “వచ్చే 25 ఏళ్లలో వికసిత్ భారత్ సాధించే దిశగా ప్రధాని మోదీ కీలక సూచనలు చేశారు. మమతా బెనర్జీకి మాట్లాడే అవకాశం ఇవ్వలేదనటం వాస్తవం కాదు. ప్రతి సీఎంకు మాట్లాడేందుకు 7 నిమిషాల సమయం ఇచ్చాం. ప్రధానంగా రెండు అంశాలపై చర్చ జరిగింది. 2047 నాటికి వికసిత్ భారత్ సాకారం అయ్యే ప్రణాళికపై చర్చించాం. దేశంలో ప్రతి ఇంటికీ తాగునీరు, విద్యుత్ వంటి సదుపాయాల కల్పనపై చర్చించాం. వికసిత్ భారత్‌పై కేంద్రం రూపొందించిన డాక్యుమెంట్‌ను వివరించాం. వికసిత్ భారత్ సాధించడంలో రాష్ట్రాల సహకారం చాలా ముఖ్యం. రాష్ట్రాలు అమలు చేయాల్సిన ప్రణాళికలపై సూచనలు చేశాం. వైద్యరంగంలో తీసుకురావాల్సిన సంస్కరణలపై విస్తృతంగా చర్చించాం. సైబర్ సెక్యూరిటీలో అమలు చేయాల్సిన సాంకేతిక పరిజ్ఞానంపై చర్చించాం. అభివృద్ధి విషయంలో రాష్ట్రాల ప్రణాళికలు కూడా నీతి ఆయోగ్ శ్రద్ధగా విన్నది. కొన్ని రాష్ట్రాల సూచనలు, వారి ప్రణాళికలు చాలా బాగున్నాయి. తెలంగాణ, తమిళనాడు, కేరళ సహా పది రాష్ట్రాల నుంచి నీతి ఆయోగ్ సమావేశానికి ఎవరూ పాల్గొనలేదు” అని సీఈవో వివరించారు.

## తెలంగాణలోని 13 మంది

# డీఎస్పీలకు పదోన్నతులు

మొదటి పేజీ తరువాయి...

ఏసీబీలో డీఎస్పీలుగా పనిచేస్తున్న బి. శ్రీకృష్ణాగౌడ్, డి.కమలాకర్‌రెడ్డికి అడిషనల్ ఎస్పీగా పదోన్నతులు కల్పిస్తూ డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అంబర్‌పేటలోని పీటీసీలో డీఎస్పీలుగా పనిచేస్తున్న జి.వెంకటేశ్వర బాబు,పిచ్చయ్య, ఇంటెలిజెన్స్‌లో పనిచేస్తున్న జె. నర్సయ్య, నిజామాబాద్‌లోని సీసీఎస్‌లో ఏసీపీగా పనిచేస్తున్న బి. కిషన్‌కు అడిషనల్ ఎస్పీలుగా ప్రమోషన్ కల్పించారు. హైదరాబాద్‌లోని టీజీపీఏలో ఉన్న ఎండీ.మాజిద్, నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ డీఎస్పీగా పనిచేస్తున్న జి. బస్వారెడ్డి, సైబరాబాద్ సీఐ సెల్‌లో ఏసీపీ ఉన్న కె.పుల్లయ్యకు అడిషనల్ ఎస్పీగా పదోన్నతులు కల్పిస్తు ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతులు పొందిన అధికారులంతా 15 రోజుల్లో డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని రవిగుప్తా ఆదేశించారు.

# జూరాల వద్ద కృష్ణమ్మ పరవళ్లు

# 44 గేట్లు ఎత్తివేత

మొదటి పేజీ తరువాయి...

ప్రాజెక్టులోకి వదులుతున్నారు. కర్ణాటక నుండి వస్తున్న వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశాలున్నాయని జూరాల అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో ఉమ్మడి పాలమూరు జిల్లాల్లో కృష్ణానది పరవళ్లు తొక్కుతూ నిండుకుండలా ప్రవహిస్తుంది. అదేవిధంగా ఇటిక్యాల మండలం బీచుపల్లి దగ్గర సైతం కృష్ణానది నిండుకుండలా ప్రవహిస్తూ శ్రీశైలం జలాశయాని కి పరుగులు పెడుతోంది. జూరాల ప్రాజెక్టు పై ఆధారపడిన నెట్టెంపాడు ఎత్తిపోతల పథకాలతో పాటు కుడి, ఎడమ సమాంతర కాలువకు సాగునీటిని వదులుతున్నారు. శనివారం సాయంత్రానికి జూరాల జలాశయంలో 317.550 మీటర్ల స్థాయిలో 7.740 టీఎంసీల నీటి నిలువలను ఉంచుకొని దిగునకు నీటిని వదులుతున్నారు. దీంతో పాటు విద్యుత్ ఉత్పత్తికి 19,683, నెట్టెంపాడు లిఫ్ట్ కు 750, కుడి, ఎడమ కాలువలకు 1,273, సమాంతర కాలువకు 400 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేశారు.

## నీతి ఆయోగ్

# సమావేశంలో రభస

మొదటి పేజీ తరువాయి...

ఆరోపించారు మమతా బెనర్జీ. ఎందుకిలా చేశారని అడిగినా ఎవరూ సమాధానం చెప్పలేదని మండి పడ్డారు. ఎందుకింత వివక్ష చూపిస్తున్నారంటూ ప్రశ్నించారు. తాను సమావేశానికి హాజరైనందుకు ఆనందించాల్సింది పోయి ఇలా ప్రవర్తిస్తారా అని అసహనం వ్యక్తం చేశారు. ప్రతిపక్షం నుంచి వచ్చిన ఒకే ఒక నేత గొంతుని ఎందుకు అణిచివేస్తున్నారని ఫైర్ అయ్యారు. ఇది బెంగాల్‌కే కాకుండా స్థానిక పార్టీలకే ఘోర అవమానం అని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు ఎలాంటి నిధులు ఇవ్వలేదని విమర్శించారు. నీతి ఆయోగ్‌ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు మమతా బెనర్జీ. అంతకు ముందు ఉన్న ప్లానింగ్ కమిషన్‌ని మళ్లీ తీసుకురావాలని అన్నారు. నీతి ఆయోగ్‌కి ఆర్థిక పరంగా ఎలాంటి అధికారాలు లేవని, అసలు అది ఎలా పని చేస్తుందో అర్థం కావడం లేదని విమర్శించారు. నీతి ఆయోగ్‌కి అధికారాలు ఇవ్వడమా లేదంటే ప్లానింగ్ కమిషన్‌ని మళ్లీ తీసుకురావడమా అన్నది కేంద్రం ఆలోచించాలని సూచించారు.

## బీజేపీకి 8 ఎంపీ సీట్లు ఇచ్చినా..

# తెలంగాణపై అదే వివక్షా?: కేటీఆర్

హైదరాబాద్, జులై 27 (ప్రభాత ఉదయం): తెలంగాణపై ప్రధాని మోదీ మొదటి నుంచే మనసులో ద్వేషం నింపుకున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. ‘సాబ్ కా సాత్.. సబ్ కా వికాస్’ అంటూనే అందులో తెలంగాణను మాత్రం దూరం పెడుతున్నారన్నారని విమర్శించారు. తెలంగాణకు నిధులు మంజూరు చేయాలని ఎన్నిసార్లు అడిగినప్పటికీ ఆయన పట్టించుకోలేదని చెప్పారు. ఇతర రాష్ట్రాలపై మాత్రం ఎనలేని ప్రేమ చూపుతున్నారని దుయ్యబట్టారు. మొన్నటి కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు చేసిన అన్యాయం అంత ఇంత కాదని విమర్శించారు. హైదరాబాద్ మెట్రో కోసం నిధులు మంజూరు చేయాలని ఎన్నిసార్లు కోరినప్పటికీ పెడచెవిన పెట్టారని మండిపడ్డారు. తాజాగా ప్రకటించిన బడ్జెట్‌లోనూ మళ్లీ హైదరాబాద్ మెట్రోకు మొండి చెయ్యే చూపించారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచే తల్లిని చంపి బిడ్డను బతికించారంటూ మోదీ తన



తెలంగాణ వ్యతిరేకత ఎన్నోసార్లు బయటపెట్టుకున్నారని చెప్పారు. అదే ద్వేషాన్ని మన రాష్ట్ర అభివృద్ధికి నిధులు ఇచ్చే విషయంలోనూ చూపిస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో ఎన్డీయే అధికారంలోకి వస్తుందన్న ఉద్దేశంతో గెలిచే పార్టీ ఎంపీలు ఉంటే మన రాష్ట్రం అభివృద్ధి అవుతుందని భావించిన తెలంగాణ ప్రజలు ఈ సారి బీజేపీకి 8 ఎంపీ సీట్లు ఇచ్చారని గుర్తుచేశారు. కానీ ఏం ప్రయోజనం అని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కన్నా కూడా మనకు నిధుల్లో కోతలు పెట్టారన్నారు. మరి తెలంగాణ నుంచి గెలిచిన బీజేపీ ఎంపీలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. బీజేపీకి 8 సీట్లు ఇచ్చింది రాష్ట్రంపై ఇలా వివక్షను మరింత చూపేందుకేనా అని ప్రశ్నించారు. గతంలో తాము అధికారంలో ఉన్నప్పుడు కూడా హైదరాబాద్ మెట్రోకు ఎన్నోసార్లు నిధులు కావాలని అడిగితే పట్టించుకోలేదని గుర్తుచేశారు. ఇదే కేంద్రం హైదరాబాద్ మెట్రోను విస్మరిస్తూ మిగతా రాష్ట్రాల్లో మెట్రో ప్రాజెక్టులకు మాత్రం భారీగా నిధులు కేటాయిస్తుందని లెక్కలతో సహా కేటీఆర్ వివరించారు.

ఉత్తర ప్రదేశ్ (4 ప్రాజెక్టులు)- రూ.5,134.99 కోట్లు,
మహారాష్ట్ర (3 ప్రాజెక్టులు)- రూ.4,109 కోట్లు
గుజరాత్ (3 ప్రాజెక్టులు)- రూ.3,777.85 కోట్లు
ఢిల్లీ (2 ప్రాజెక్టులు) -రూ.3,520.52 కోట్లు
కర్ణాటక-రూ.1880.14 కోట్లు
మధ్యప్రదేశ్ (2 ప్రాజెక్టులు)- రూ.1,638.02 కోట్లు
బీహార్- రూ.1,400.75 కోట్లు
తమిళనాడు- రూ.713 కోట్లు
కేరళ (2 ప్రాజెక్టులు)- రూ.146.74 కోట్లు
ఢిల్లీ-ఘజియాబాద్ రాపిడ్ రైల్ ప్రాజెక్టుకు- రూ.1,106.65 కోట్లు ఇచ్చిందని వెల్లడించారు.

గత పదేండ్లలో దేశంలోని 20 మెట్రో ప్రాజెక్టుల కోసం మోదీ ప్రభుత్వం వివిధ రాష్ట్రాలకు భారీగానే నిధులు కేటాయించింది. కానీ తెలంగాణకు మాత్రం చిల్లి గవ్వ కూడా ఇవ్వలేదన్నారు. హైదరాబాద్ మెట్రో విషయంలో జరిగిన అన్యాయాన్ని మోదీకి వివరించి రాష్ట్ర బీజేపీ ఎంపీలు నిధులు తేవాలని డిమాండ్ చేశారు.

## శాసనసభ

# సోమవారానికి వాయిదా

హైదరాబాద్, జులై 27 (ప్రభాత ఉదయం): తెలంగాణ శాసనసభ సోమవారానికి వాయిదా పడింది. బడ్జెట్‌పై సాధారణ చర్చ ముగియగానే సభను ఈ నెల 29వ తేదీకి సభ వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు. 29వ తేదీన ఉదయం 10 గంటలకు సభ తిరిగి ప్రారంభం కానుంది. శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైన శాసనసభ రాత్రి 9:15 గంటల వరకు కొనసాగింది. బడ్జెట్ ప్రసంగం ఒక రాజకీయ ప్రసంగంలా ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలన బాగాలేదని మాటలు చెబితే సరిపోతుందా? అని ప్రశ్నించారు. పదేండ్ల పాలనలో ఉన్న సమాచారాన్ని తొలగించారు. కంప్యూటర్ నుంచి తొలగిస్తారేమో కానీ, ప్రజల మెదడు నుంచి తొలగించలేరని పేర్కొన్నారు. అక్షరాలను తొలగిస్తారేమో కానీ, అనుభవాల్ని తొలగించలేరన్నారు. బీఆర్ఎస్ శ్రమను, కాంగ్రెస్ ఎనిమిది నెలల డ్రామాలను ప్రజలు చూస్తున్నారని చెప్పారు. రాష్ట్ర బడ్జెట్ మొత్తం అవాస్తవాలతో నిండి ఉంది. ట్యాక్స్ రెవెన్యూ ఎక్కువ వస్తుందని బడ్జెట్‌లో పెట్టారు. పన్నేతర ఆదాయంలో రూ.35 వేల కోట్లు వస్తుందని బడ్జెట్‌లో చూపించారు. ఎలా వస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. విధానాల రూపకల్పన కంటే బీఆర్ఎస్‌ను తిట్టడంపైనే ఎక్కువ దృష్టిపెట్టారన్నారు. గతంలో రుణమాఫీ కోసం భూములు అమ్మితే భట్టివిక్రమార్క, శ్రీధర్‌బాబు విమర్శించారు. ఇప్పుడు రూ.10 వేల కోట్ల విలువ చేసే భూములు అమ్మి నిధులు సమీకరిస్తున్నారుని ఆగ్రహం వ్యక్తంచేశారు. మీ మాటపై గౌరవం ఉంటే భూములు అమ్ముకునే ప్రతిపాదన ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సాధ్యంకాని తరహాలో ఆదాయం ఎక్కువ చూపించారని, తప్పనిసరి ఖర్చులను తక్కువ చేసి చూపించారన్నారు. ఏకకాలంలో రుణమాఫీ అన్నారు. బడ్జెట్‌లో రూ.26 వేల కోట్లు మాత్రమే వస్తున్నది. ఆలస్యం అయిందని రైతుల నుంచి వడ్డీ వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం ఆలస్యం చేసి వడ్డీ భారాన్ని రైతులపై మోపుతున్నదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో 200 వందల పింఛన్ ఇస్తే బీఆర్ఎస్ పాలనలో రూ.2వేలకు పెంచామని తెలిపారు. అధికారంలోకి రాకముందు రూ.4 వేలు పింఛన్ ఇస్తామన్నారు. ఆ 4 వేల పింఛన్ ఇంకా నాలుక మీదనే ఉందని ఎద్దేవా చేశారు.

## ఆగస్టులో ప్రధాని మోదీ

# ఉక్రెయిన్ పర్యటన

మొదటి పేజీ తరువాయి...

అధ్యక్షుడు జెలెన్‌స్కీతో మోదీ భేటీ అయ్యారు. అప్పటి నుంచి ఉక్రెయిన్ విషయంలో భారత్ వైఖరి ఎలా ఉండనుందన్న ఆసక్తికర చర్చ మొదలైంది. అయితే...మోదీ ఉక్రెయిన్ పర్యటనపై అధికారికంగా ఎలాంటి ప్రకటన రాలేదు. అటు ఉక్రెయిన్ కూడా ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. జులై 8వ తేదీన మోదీ రష్యా పర్యటనకు వెళ్లారు. పుతిన్ ఆయనకు ఆత్మీయంగా ఆహ్వానం పలికారు. అంతే కాదు. మోదీని కౌగిలించుకున్నారు. ఈ ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ ఫొటోలపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఉక్రెయిన్‌పై అంత దారుణాలు పాల్పడుతున్న రష్యాతో భారత్ అంత సన్నిహితంగా ఉండడమేంటని ప్రశ్నించారు. సరిగ్గా అదే రోజు కీవ్‌లోని పిల్లల ఆసుపత్రిపై రష్యా దాడి చేసింది. ఈ దాడికి సంబంధించిన ఫొటోలు షేర్ చేసిన జెలెన్‌స్కీ భారత్‌పై పరోక్షంగా విమర్శలు చేశారు. మోదీ, పుతిన్ ఇలా కౌగిలించుకోవడం, అంత సన్నిహితంగా ఉండడంపై మండి పడ్డారు. ఈ పోస్ట్‌పై భారత్ కూడా గట్టిగానే స్పందించింది. ఎవరి ప్రయోజనాలకు తగ్గట్టుగా వాళ్లు నిర్ణయాలు తీసుకునే హక్కు అన్ని దేశాలకూ ఉంటుందని, అది దృష్టిలో పెట్టుకుని మాట్లాడాలని తేల్చి చెప్పింది.



# రాజేంద్రనగర్ సర్కిల్ లో నేడే బోనాలు

## ప్రజలకు బోనాల శుభాకాంక్షలు తెలిపిన కార్పొరేటర్ పి అర్చన జయప్రకాష్



చార్మినార్ నుంచి అత్తాపూర్ నల్ల పోచమ్మ అమ్మ వారి దేవాలయానికి తొట్టెల, పూజలు చేసిన మజ్లీస్ నాయకులు ప్రవీణ్ నావెందర్



అందంగా ముస్తాబైన మధుబన్ కాలనీ పోచమ్మ దేవాలయం



తొట్టెలకు పూజలు చేస్తున్న ప్రవీణ్ నావేందర్

బుద్వేల్, జూలై27(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ సర్కిల్ లో ఆదివారం బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి భక్తులు, దేవాలయ కమిటీ ప్రతినిధులు అమ్మవారి దేవాలయాలను అందంగా ముస్తాబు చేశారు. రాజేంద్రనగర్ శ్రీ మాత పోచమ్మ దేవాలయం , శ్రీ ఈదమ్మ దేవాలయం , అంబేద్కర్ నగర్ ను ఆనుకొని కాలేజ్ ఫామ్ లో ఉన్న శ్రీ మైసమ్మ దేవాలయం, బుద్వేల్ శ్రీ కట్ట మైసమ్మ దేవాలయం , గ్రీన్ సిటీ మైసమ్మ దేవాలయం, కోటమైసమ్మ దేవాలయం , హైదర్ గూడ, అత్తాపూర్, చింతల్ మెట్, బాబు రెడ్డి నగర్ , పద్మశాలిపురం, గగన్ పహాడ్, శివరాంపల్లి, ప్రేమావతి పేట్, మధుబన్ కాలనీ తదితర బస్తీలు, కాలనీలలో ఆదివారం బోనాల ఉత్సవాలు నిర్వహించనున్నారు. బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని హైదర్ గూడ ప్రణవభక్త సమాజం ప్రతినిధులు శనివారం పోచమ్మ దేవాలయంలో పూజలు చేశారు . బోనాల ఉత్సవాలు శాంతియుతంగా జరగాలని మొక్కులు చెల్లించారు. అమ్మవారి దేవాలయాలను అందంగా అలంకరించి రంగు రంగుల విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. బోనాల ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించుకోవాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ , కార్పొరేటర్లు పి అర్చన జయప్రకాష్, ఎం సంగీత గౌరీ శంకర్ , తోకల శ్రీనివాస్ రెడ్డి లతోపాటు పలువురు నాయకులు ప్రజలను కోరారు. బోనాల ఉత్సవాల సందర్భంగా రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్, ఏసీపీ తుల శ్రీనివాస్, రాజేంద్రనగర్, మైలార్ దేవ్ పల్లి, అత్తాపూర్ ఇన్స్పెక్టర్లు క్యాస్ట్రో , నరేందర్, వెంకట్రామిరెడ్డిలు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.



రాజేంద్రనగర్ కార్పొరేటర్ పి. అర్చన జయప్రకాష్

### చార్మినార్ నుంచి అత్తాపూర్ తొట్టెల :

అత్తాపూర్ శ్రీ నల్ల పోచమ్మ దేవాలయంలో ఆదివారం జరిగే బోనాల ఊరేగింపు సందర్భంగా శనివారం చార్మినార్ నుంచి అమ్మవారికి సమర్పించడానికి తొట్టెలను తీసుకువచ్చారు. ఈ తొట్టెలకు మజ్లీస్ నాయకుడు ప్రవీణ్ నావేందర్ పూజలు చేశారు. ప్రజలకు బోనాల ఉత్సవాల శుభాకాంక్షలు తెలిపిన కార్పొరేటర్ పి అర్చన జయప్రకాష్ రాజేంద్రనగర్ సర్కిల్ ప్రజలకు కార్పొరేటర్ పి అర్చన జయప్రకాష్ బోనాల ఉత్సవాల సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. బోనాల ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని ప్రజలకు సూచించారు . ప్రజలందరికీ మేలు కలిగేలా అమ్మవారి ఆశీర్వాదాలు ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు.



తల్లిదండ్రులతో కలసి తాను చదువుతున్న పాఠశాల ఆవరణలో మొక్కను నాటుతున్న రాచూరి అభినందిని

# అమ్మ పేరుతో మొక్కలు నాటిన విద్యార్థులు

## గోల్కొండ కేంద్రీయ విద్యాలయంలో శనివారం అమ్మ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమం

బుద్వేల్, జూలై27(ప్రభాత ఉదయం): హైదర్ గూడ నివాసి, గోల్కొండ కేంద్రీయ విద్యాలయ గోల్కొండ - 1 లో 12వ తరగతి చదువుతున్న రాచూరి అభినందిని తమ పాఠశాల లో తన తల్లి రాచూరి అరుంధతి, తండ్రి రాచూరి రాజశేఖర్ తో కలిసి ప్లాంట్ ఫర్ మదర్ (అమ్మ పేరుతో మొక్క) కార్యక్రమంలో భాగంగా తాను ఒక మొక్కను నాటానని తెలిపారు. విద్యార్థులందరూ మీరు కూడా అమ్మ పేరుతో మొక్కను నాటండి అని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో తమ వంతు పాత్ర పోషించాలనుకునే ప్రతి ఒక్కరికీ ఒక మొక్క నాటడం గొప్ప ఆలోచన అన్నారు. ఎందుకంటే మనం దేవాలయం గా భావించే పాఠశాల లో చెట్లు ఉండటం మంచిదన్నారు. భవిష్యత్తుకు చెట్లు చాలా అవసరం అని, అవి కాలుష్యాన్ని తగ్గించడంలో సహాయపడతాయన్నారు. మనం ప్రతిరోజూ పీల్చే గాలిని శుభ్రపరచడంలో కూడా ఇవి సహాయపడతాయని గుర్తుచేశారు. ఒక్కమాటలో చెప్పాలంటే, చెట్లు లేకుండా భూమి మనుగడ సాగించదన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సంస్థలు ఈ వాస్తవాన్ని గుర్తించాయి అని గుర్తు చేశారు.



ఉప్పర్ పల్లి శ్రీ నల్ల పోచమ్మ అమ్మ వారికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సామ ఇంద్రపాల్ రెడ్డి

# లక్ష్మీగూడాలో 90 గ్రాముల ఎండిఎంఏ డ్రగ్స్ స్వాధీనం

## నలుగురు అరెస్ట్.. ఒకరు ముంబై వాసిగా గుర్తింపు

బుద్వేల్, జూలై27(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్ దేవ్ పల్లి డివిజన్ లక్ష్మీగూడ ఫ్రెండ్స్ కాలనీలోని ఓ ఇంట్లో శనివారం 90 గ్రాముల ఎండిఎంఏ డ్రగ్స్ ను సైబరాబాద్ ఎస్ఓటి పోలీసులు , నార్కోటిక్స్ విభాగం అధికారులు సంయుక్తంగా దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ముంబైకి చెందిన సల్మాన్ (28) తో పాటు లక్ష్మీగూడా లో నివాసం ఉండే నగరానికి చెందిన హతీక్ (35), రిజ్వాన్ (40 ), యాసిన్ (38) లను ఆగస్టు చేసి తదుపరి విచారణ నిమిత్తం మైలార్ దేవ్ పల్లి పోలీసులకు అప్పగించారు. గోవా నుంచి డ్రగ్స్ తీసుకువచ్చి నగరంలో విక్రయిస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు . గోవా నుంచి ఎప్పటి నుంచి డ్రగ్స్ తీసుకు వస్తున్నారు...... ఇక్కడ ఎవరెవరికి వాటిని విక్రయిస్తున్నారు .....అనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఎండి ఎంఏ డ్రగ్స్ విలువ లక్షలలోనే ఉంటుందని పోలీసు వర్గాలు చెబుతున్నాయి.



పరామర్శించిన బొక్క నరసింహారెడ్డి

# రంగారెడ్డి జిల్లా సూర్య బ్యూరో ఇన్చార్జిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

## బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బొక్క నర్సింహా రెడ్డి

మొయినాబాద్ జులై 27 (ప్రభాత ఉదయం) రంగారెడ్డి జిల్లా బ్యూరో ఇంచార్జ్ గణేష్ పై శుక్రవారం తెల్లవారుజామున దాడికి పాటుపడ్డ దుండుగులను పోలీసులు వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని బిజెపి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బొక్క నరసింహారెడ్డి డిమాండ్ చేశారు బడుగు బలహీన వర్గాలకు చెందిన గణేష్ ఎదుగుదలను చూసి ఓర్వలేకనే తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో కుటుంబ సభ్యులకు కుటుంబ సభ్యుల పైన జరిగిన దాడి వెనుక స్థానికంగా కొందరి కుట్ర దాగి ఉన్నట్లు వ్యక్తం చేశారు అనుమానం పాలక ప్రభుత్వాల ఉదాసీనత మూలంగా రోజురోజుకు జర్నలిస్టుల పైన దాడులు పేరుతున్నాయి అన్నారు నిజాన్ని నిర్భయంగా వెలువైతే జర్నలిస్టుల పైన దాడి చేయడం దారుణం అన్నారు దాడి వెనుక అసలు సూత్రధారులను పోలీస్ శాఖ సమగ్ర విచారణ చేపట్టి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పకడ్బందీ చర్యలు చేపట్టడంతో పాటు సూర్య జిల్లా బ్యూరో ఇంచార్జ్ గణేష్ ఆయన కుటుంబానికి దుండగుల చేతిలో ప్రాణాని ఉందని ప్రభుత్వం తక్షణమే ఆయనకు ఆయన కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించాలని కోరారు...



# బీజేఎంసీ వక్ఫ్‌బోర్డు ఆస్తుల విషయంపై బోర్డు చైర్మెన్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు మహ్మద్ యాసీన్

గండిపేట్,జులై 27( ప్రభాత ఉదయం) బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని వక్ఫ బోర్డు ఆస్తులను సంరక్షించాలని వక్ఫ్‌బోర్డు చైర్మెన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేన్‌ను కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు మహ్మద్ యాసీన్ అయూబీ కోరారు.ఈ మేరకు శనివారం వక్ఫ్‌బోర్డు చైర్మెన్‌ను మహ్మద్ యాసీన్ అయూబీ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని సన్‌సిటీ రాజ్‌గర్‌లోని వక్ఫ్‌బోర్డు ఆస్తుల గురించి చర్చించామన్నారు.ఈ మేరకు బోర్డు చైర్మెన్ సానుకూలంగా స్పందించారన్నారు.దోషులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతేకాకుండా ఆస్తులను సర్వే చేసి నివేదిక ఇవ్వాలని బోర్డు ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారని వివరించారు.










## శంషాబాద్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించిన

# ఏఐటీయూసీ నాయకుడు ప్రభు



శంషాబాద్, జూలై27(ప్రభాత ఉదయం) శంషాబాద్ పట్టణంలో ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు అన్నెపు ప్రభు అమ్మ నీలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె పేరుతో అంబేద్కర్ విగ్రహం దగ్గర 2000 మంది కార్మికులకు ఉచిత భోజన ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు పాల్గొని కార్మికులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి నర్రగిరి, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు అన్నెపు ప్రభు, నీరటి శ్రీనివాస్,లింగాల,అరుణ్,శైలేందర్, శ్రీను,చారి, నీరటి శ్రీనివాస్ ప్రశాంత్, రాజు, ఉదయ్, అంబటి సురేష్,శ్రీను మెరుగు సతీష్,బడుగు లింగం, రాజేష్,కుమార్, ప్రభాకర్, లక్ష్మణ్,తదితరులు పాల్గొన్నారు.



మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

## అబ్దుల్ కలాంకు ఘన నివాళులు

### ఘనంగా అబ్దుల్ కలాం వర్ధంతి

### మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంకు ఘనంగా నివాళి

కొత్తకోట, జూలై 27(ప్రభాత ఉదయం): మాజీ రాష్ట్రపతి, బహుముఖ ప్రజ్ఞాశాలి, ప్రముఖ శాస్త్రవేత్త స్వర్గీయ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని శనివారం కొత్తకోట పట్టణంలో ఘనంగా నిర్వహించి నివాళులర్పించారు. శాఖ గ్రంథాలయంలో వేముల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో పాఠకులు ఆయన వర్ధంతి సందర్భంగా శనివారం చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. ఒక పేద ముస్లిం కుటుంబంలో 1931, అక్టోబర్ 15న జన్మించి జూలై 27-2015 న ఆయన షిల్లాంగ్ లో విద్యార్థుల గురించి ఉపన్యాసం ఇస్తుండగా హఠాత్తుగా కుప్పకూలి పోయి మరణించారు. ఆయనదేశానికి చేసిన సేవలు అణ్వాయుధ పరీక్షలలో భారతదేశాన్ని అను శక్తిగా పటిష్టం చేసి, మరియు దేశానికి తొలి మిస్సైల్ ను అందించిన ఘనత ఆయనదే, అందుకే కలాని జాతీయ హీరోగా నిలబెట్టి ఆయనకు పద్మభూషణ్, పద్మ విభూషణ్, భారతరత్న వరించాయి. 11వ రాష్ట్రపతి పదవి కాలం ముగియగానే ఆయన పదవి విడిచిపెట్టిన తర్వాత కలాం భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి సైన్స్ మరియు టెక్నాలజీని అభివృద్ధి చేసి తది శ్వాస వరకు భారత మాత సేవలో ధరించి యువత భవిత కోసం భారత యువతను తట్టి లేపి తపించిన మహా తపస్వి ఆయన మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం గారి వర్ధంతిని గ్రంథాలయంలో ఘనంగా నివాళులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎండి తాజ్, ఆశన్న ముదిరాజ్, బాల్ రెడ్డి, రసూల్, వెంకటేష్, నరేష్, మస్తాన్, హైమద్, చందు, ఫరూక్, దొరస్వామి, సుధీర్ తదితరులు ఘనంగా నివాళులర్పించారు.





## బడి బయట వున్నా పిల్లలందరూ బడిలోనే ఉండాలని ర్యాలీ

గద్వాల, జూలై 27(ప్రభాత ఉదయం) కేటీదొడ్డి మండలంలోని ఇర్కిచెడు గ్రామం లో సిఆర్ పి ఎఫ్ ఆధ్వర్యంలో కాగడాలతో విది విది వడ వడ లో నినాదలు చేసుకుంటూ అవగహన కల్పిస్తూ భారీ ర్యాలీ ద్వారా సి ఆర్ పి ఎఫ్ కన్వీనర్ చందుపాషా మాట్లాడుతూ ...మన గ్రామంలో పిలలు కాటన్ సీడ్ పత్తి పనులకు పంప కుండా రోజు బడికి పంపాలన్నారు.

## గ్రేటర్ హైదరాబాద్‌కు బడ్జెట్‌లో నిధులు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేసిన కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

కూకట్‌పల్లి, జూలై 27 (ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్రం గ్రేటర్ హైదరాబాద్ నగర అభివృద్ధికి బడ్జెట్ లో రూ. 10 వేల కోట్ల కెటారంచడం పట్ల తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, పోశెట్టిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.






## జనసేన పార్టీ సభ్యత్వ నమోదును ప్రారంభించిన

# ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్

కూకట్‌పల్లి, జూలై 27 (ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్రం లో కూకట్ పల్లి నియోజకవర్గం కెపిహెచ్బి కాలనీ పరిధిలోని 114 డివిజన్ సర్దార్ పటేల్ నగర్ జనసేన పార్టీ నాల్గవ దశ సభ్యత్వ నమోదు కార్యక్రమం సందర్భంగా శనివారం సర్దార్ పటేల్ నగర్ లో జనసైనికులు ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కూకట్ పల్లి జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కొల్లా శంకర్, అడబాల షణ్ముఖ కలిగినీడి ప్రసాద్ , శ్రీనివాస్ గోవింద, ఆత్మూరి మోహన్, లీల మనోహర్, పులగం సుబ్బు ,పాదం సూర్య, దుస్స నీరజ్, బల్ల భవాని ప్రసాద్, కడియం సుబ్బు, గడ్డం వీర, పోలె బోయిన గోపి, మణి కంట, పోలె బోయిన శ్రీనివాస్ మరియు కూకట్ పల్లి జనసైనికులు పాల్గొన్నారు.



వెంకటేశ్వర కాలనీలో గుంతలు పడి బురదమయంగా మారిన రోడ్డు

# వెంకటేశ్వర ఇదేమి రోడ్డు

### వెంకటేశ్వర కాలనీలో అధ్వానంగా మారిన రోడ్లు

శంషాబాద్. జూలై 27(ప్రభాత ఉదయం) శంషాబాద్ పురపాలక సంఘం పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో రోడ్ల పరిస్థితి అద్వానంగా మారింది . అడుగడుగునా గుంటలు ఆ గుంటలలో నిలిచిన వర్షపు నీరు. అసలే వర్షాకాలం కావడంతో గుంతలలో అడుగు లోతు వర్షపు నీళ్లు నిలిచి మరింత అద్వానంగా మారాయి. మట్టి రోడ్లో ఉండడంతో వాహనాలపై ప్రయాణించడం అటు ఉంచితే కనీసం కాలినడకన కూడా నడిచే పరిస్థితి లేదు. వాహనాలు. పాదచారులు నిరంతరం తిరుగుతూ ఉంటారు. స్థానిక కౌన్సిలర్ మున్సిపల్ అధికారులు చొరవ తీసుకొని వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు. కాలనీ నుండి లక్షలాది రూపాయలు టాక్స్ లు చెల్లిస్తున్నప్పటికీ కనీసం రోడ్డు వసతి కూడా కల్పించకపోవడం పట్ల వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా పరిషత్ నూతన అధికారులు

## జిల్లా అభివృద్ధి కోసం అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలి

### ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 27(ప్రభాత ఉదయం) జిల్లా అభివృద్ధి కోసం అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని గద్వాల శాసనసభ్యులు మండల కృష్ణమోహన్ రెడ్డి సూచించారు. శనివారం ఇటీవల బదిలీపై జిల్లా పరిషత్ కు వచ్చిన అధికారునులు గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ జడ్పి సీఈఓ గా భాగ్యలక్ష్మి , జడ్పీ సీఈఓ కాంతమ్మ లు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు. అదేవిదంగా కేటీ దొడ్డి ఎంపీడీఓ గా బాధ్యతలు తీసుకున్న ఆంజనేయ రెడ్డి మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి ని కలిశారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.ఈ కార్యక్రమంలో గట్టు ఎంపీడీఓ చెన్నయ్య, ఎంపీవో కృష్ణ మెహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి

# రెగ్యులర్ ఎంప్లాయ్‌గా గుర్తించాలి

### పారిశుద్ధ్య కార్మికుల జీతాలు పెంచాలి:

### ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు డిమాండ్



ఎల్ బి నగర్, జూలై 27(ప్రభాత ఉదయం) పారిశుద్ధ్య కార్మికులను గత అనేక సంవత్సరాలుగా ఔట్ సోర్సింగ్ పద్ధతి నా పని చేయించుకుంటున్నారూ. మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ ఎంప్లాయ్ గా గుర్తించి వారి జీతభత్యాలు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎల్బీనగర్ జోన్ పరిధిలో మూడు మున్సిపల్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో శనివారం నాడు కార్మికులతో ఆయన మాట్లాడారు. మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డితో కలిసి ఆయన కార్మికుల నిర్దేశించి మాట్లాడు. కార్మికులతో రోజుకు మూడుసార్లు ఫేస్ స్కానర్ నిబంధన పెట్టి వారిని ఇబ్బంది పెట్టడం సరైనది కాదని ఆయన గుర్తు చేశారు పారిశుధ్య కార్మికుల వయోపరిమితి అయినవారి కుటుంబాల్లో వారి వారసులను విధుల్లోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కార్మికులందరికీ అందించాలని ఆయన డిమాండ్ చేశాడు. వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ కార్మికులు ఎన్నో పోరాటాలు నిర్వహించి సాధించుకున్న వారాంతపు సెలవులు వేతనంతో కూడుకున్న సెలవులు ఇచ్చేవారు గతంలో పేస్ స్కానర్ వచ్చిన తర్వాత వారంలో ఆరు రోజులు విధులు నిర్వహిస్తేనే వేతనంతో కూడుకున్న సెలవు ఇస్తున్నారు. వారంలో ఒక్కరోజు అనారోగ్యంతో వీధిలోకి రాకపోయినా వీక్లీ ఆఫ్ ను కూడా రద్దు చేసి రెండు రోజుల ఆబ్సెంట్ వేసి జీతాలు కట్ చేస్తున్నారు. ఇది దుర్మార్గమైన పద్ధతి అని ఆయన విమర్శించారు. జాతీయ సెలవులు , ఈ.ఎల్,సి.ఎల్, లాంటి సెలవులను పారిశుద్ధ్య కార్మికులకు వర్తింపచేయాలని ఆయన డిమాండ్ చేశారు. అన్ని సమస్యల మీద తేదీ 30/7/24 మంగళవారం రోజు ఉదయం 10 గంటలకు చలో హైదరాబాద్ ఇంద్ర పార్క్ ధర్నా ను కార్మికులందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల ప్రధాన కార్యదర్శి మద్దిలేటి , మండల అధ్యక్షుడు రాములు గౌడ్, పారిశుద్ధ్య కార్మికులు ధనంజయ, హంసమ్మ , ప్రమీల, అండాలు, చంద్రమ్మ , ఆనంద్ , తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.